మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 11-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 193 Issue: 193


11 జనవరి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 5:55 తిథి అష్టమి ఉ. 10:21 వరకు తరువాత నవమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం చిత్తా సా. 6:08 వరకు తరువాత స్వాతి యోగం సుకర్మ సా. 5:26 వరకు కరణం కౌలవ ఉ. 10:21 వరకు తైతుల రా. 11:31 వరకు వర్జ్యం రా. 12:28 నుండి రా. 2:16 వరకు దుర్ముహూర్తం సా. 4:26 నుండి సా. 5:10 వరకు రాహుకాలం సా. 4:32 నుండి సా. 5:55 వరకు యమగండం మ. 12:24 నుండి మ. 1:46 వరకు గుళికాకాలం మ. 3:09 నుండి సా. 4:32 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు ఉ. 11:06 నుండి మ. 12:52 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:01 నుండి మ. 12:46 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# అప్పు కట్టలేదని నోట్లో విషం పోసి..!

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ దారుణ హత్య

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు నానాటికీ పెరుగుతున్నాయి. ఇటీవలే ఇస్లాం వ్యతిరేఖ ఆరోపణలతో పలువురు హిందు మతానికి చెందిన వ్యక్తులుపై దాడి చేసి చంపిన సంగతి తెలిసిందే. తాజాగా సునాంఘంజ్ అనే జిల్లాలో జోయ్ మహాపాత్ర అనే యువకుడిపై దాడి చేసి అనంతరం విషం ఇచ్చి చంపినట్లు అక్కడి మీడియా కథనాలు తెలిపాయి.




ఢాకా: 500 టాకాలు (బంగ్లా కరెన్సీ) వాయిదా కట్టలేదని జోయ్ మాహాపాత్రపై అక్కడి అల్లరిమూకలు దాడి చేశాయి. అతనిని తీవ్రంగా కొట్టి అనంతరం విషం ఇచ్చాయి. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహాపాత్రను ఉస్మానీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత పదిరోజుల్లో బంగ్లాదేశ్‌లో నలుగురు హిందువులు హత్యకు గురయ్యారు. నూతన సంవత్సర వేడుకల తరువాయి 2 వ పేజీలో...

# పంచ చేనులోనే హిందూ రైతు హత్య

## పాకిస్థాన్‌లో ఘోరం కాల్చి చంపిన భూస్వామి

పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో ఒక భూస్వామి అహంకారం ఒక నిరుపేద హిందూ రైతు ప్రాణాలను బలితీసుకుంది. కైలాష్ కోహ్లీ అనే హిందూ రైతును సర్ఫరాజ్ నిజామాని అనే భూస్వామి దారుణంగా కాల్చి చంపిన ఉదంతం ఇప్పుడు ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. స్థానిక నివేదికల ప్రకారం.. భూస్వామి సర్ఫరాజ్ నిజామాని తన వద్ద భూమి కౌలుకు తీసుకున్న కైలాష్ కోహ్లీ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.



ఇస్లామాబాద్: తాజాగా సర్ఫరాజ్ నిజామాని.. కైలాష్ కోహ్లీపై తుపాకీతో విరుచుకుపడ్డాడు. కైలాష్ గుండెల్లోకి నేరుగా కాల్పులు జరపడంతో.. అతను ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అయితే ఈ హత్యకు దారితీసిన ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేవలం భూమి వివాదమా లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో విచారణ జరుగుతోంది. ఈ కిరాతక హత్య వార్త దావాగ్నిలా వ్యాపించడంతో హిందూ మైనారిటీ సంఘాలు, తరువాయి 2 వ పేజీలో...




## టీజీ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ

### అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన నిర్ణయించింది. ఈ మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పేరుతో ప్రకటన విడుదలైంది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే దిశగా, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ -2 వ పేజీలో...

# విషమిచ్చి చంపండి



## అడ్డగోలు రాతలు మంచిది కాదు

### అవాస్తవాలు వండి వార్చొద్దు.. కొడుకు పోయాక సగం చనిపోయా

### ఇంకా మానసికంగా వేధిస్తున్నారు.. మంత్రి కోమటిరెడ్డి తీవ్ర ఆవేదన

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనను ఇంకా మానసికంగా ఇబ్బంది పెట్టాలనుకుంటే ఒకేసారి ఇంత విషమిచ్చి చంపేయండని షాకింగ్ కామెంట్స్ చేశారు. శనివారం (జనవరి 10) మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల మంత్రులు, మహిళా ఐఏఎస్ ఆఫీసర్ల మీద వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): బాధ్యతాయుతమైన ఐఏఎస్‌లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఆఫీసర్ల మీద అభియోగాలు కరెక్ట్ కాదన్నారు. ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని.. మహిళా ఆఫీసర్లను ఇబ్బందులు పెడుతూ ఏం సాధిస్తారని ప్రశ్నించారు. నాపై ఏమైనా రాయాలనుకుంటే రాయండి తట్టుకుంటా కానీ మహిళా అధికారులపై ఇష్టమొచ్చినట్లు వార్తలు రాయొద్దని హెచ్చరించారు. రేటింగ్‌లు, వ్యూస్ కోసం అవాస్తవాలు వండి వార్చడం కరెక్ట్ కాదని మండిపడ్డారు. ఛానళ్ల మధ్య పోటీ కోసం మహిళా అధికారులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఉంటుందని.. అడ్డగోలు రాతలు మంచికాదని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. తన కొడుకు చనిపోయినప్పుడే సగం చనిపోయానని.. తప్పుడు ఆరోపణలతో తనను ఇంకా మానసికంగా హింస్తున్నారని తరువాయి 2 వ పేజీలో...



# ఘనంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

## పాల్గొన్న ప్రధాని మోదీ.. ప్రత్యేక పూజలు... ఆకట్టుకున్న డ్రోన్ షో

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాచీన పుణ్యక్షేత్రంలో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక అద్భుతమైన డ్రోన్ ప్రదర్శనను కూడా వీక్షించారు. ఇందులో అనేక అంశాల ఆధారంగా రూపొందించిన ఫొటోల ద్వారా శివుడు, శివలింగం భారీ చిత్రాలను రూపొందించారు. దీనితో పాటు, సోమనాథ్ ఆలయం అద్భుతమైన 3డీ చిత్రీకరణ కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

సోమనాథ్: సోమనాథ్ ఆలయంలో నిర్వహించిన సామూహిక ఓంకార మంత్ర జపంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. చారిత్రాత్మక సోమనాథ్ ఆలయంపై జరిగిన మొదటి దాడికి 1,000 సంవత్సరాలు ఇటీవల పూర్తయిన సందర్భంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ జరుపుకుంటున్నారు. ఈ వేడుక ఆదివారంతో ముగుస్తుంది. ఆదివారం సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరిట నిర్వహించే భారీ బహిరంగ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,046 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,558 |

## విశ్వవాణి



జెల్లీ ఫిష్‌కు గుండె గానీ, మెదడు గానీ ఉండదు. నాడీ వ్యవస్థ కూడా ఉండదు. కేవలం నరాల ద్వారానే స్పర్శ, నీటిలోని ఉష్ణోగ్రతను గుర్తిస్తాయి.



# చిరు సినిమా టికెట్ రేట్ల పెంపు

## ప్రీమియర్ షో టికెట్ ధర రూ.600.. జీవో జారీచేసిన తెలంగాణ సర్కారు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం మనశంకర వర ప్రసాద్ గారు సినిమా ఆదివారం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు ఇప్పటికే ఏపీ సర్కారు టికెట్ రేట్లు పెంచుతూ జీవో జారీచేయగా, తాజాగా శనివారం తెలంగాణ సర్కారు కూడా టికెట్ రేట్ల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 11న ఒక ప్రీమియర్ షోకు అనుమతినిస్తూ ప్రత్యేక జీవో రిలీజ్ చేసింది.

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): ఈ జీవో ప్రకారం ప్రీమియర్స్ రోజున టికెట్ ధర రూ. 600 గా నిర్ణయించగా, 12 నుంచి సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్సులలో రూ.100 పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సినిమా టికెట్ ధరల పెంపుపై పిటిషన్ హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలైంది. టికెట్ ధరలు పెంచడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా ధరలు తరువాయి 2 వ పేజీలో...



## నాకేం తెల్వదు

### మంత్రి కోమటిరెడ్డి

# ఆల్మంట్ కిడ్ సిరప్ వాడొద్దు

## తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ ఆదేశాలు

### టానిక్‌లో ప్రమాదకర స్థాయిలో ఇథలీన్ గ్లైకాల్

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): పిల్లల కోసం వినియోగించే ఆల్మంట్ కిడ్ సిరప్ వినియోగాన్ని నిలిపివేయాలని తెలంగాణ ఔషధ నియంత్రణ మండలి ( డీసీఏ) ఆదేశించింది. ఈ సిరప్‌లో ఇథలీన్ గ్లైకాల్ ప్రమాదకరంగా ఉన్నట్లుగా గుర్తించిన నేపథ్యంలో ఈ హెచ్చరికలు చేసింది. బీహార్‌కు చెందిన ట్రిడస్ రెమెడీస్ సంస్థ తయారు చేసిన ఏఎల్ 24002 బ్యాచ్ సిరప్‌ల్లో కల్తీ జరిగిందని పశ్చిమ బెంగాల్‌లో గుర్తించారు. ఈ నేపథ్యంలో కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనేషన్ నుంచి హెచ్చరికలు అందాయి. ఈ నేపథ్యంలో తరువాయి 2 వ పేజీలో...






హైదరాబాద్-విజయవాడ వైపు జాతీయ రహదారి 65పై చౌటుప్పల్ వద్ద ఉన్న పంతంగి టోల్ ప్లాజా వద్ద శనివారం భారీగా వాహనాల రద్దీ ఏర్పడింది. సంక్రాంతి కోసం ఏపీ వాసులు సొంతూళ్లకు పయనం అవడంతో వాహనాలు కిలోమీటర్ల కొద్దీ నిలిచిపోయాయి. రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. - చౌటుప్పల్ (ఈవార్తలు)

## రాశి ఫలాలు
11.1.2026

మేషం: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. సోదరులతో మాట పట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ స్థానచలన సూచనలున్నవి.

వృషభం: వ్యాపారమున పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున పదోన్నతి పెరుగుతుంది. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది. ఆప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. దైవదర్శనాలు చేయనుకుంటారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. నూతన వస్త్రా, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

మిధునం: ఆర్థిక విషయాలు ఆశాజనకంగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలు అనుకూలంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున సంతోషంగా గడుపుతారు. మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: బంధు వర్గంతో వివాదాలుంటాయి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో గంధరగోళ పరిస్థితులుంటాయి.

సింహం: స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన రుణయత్నాలు చేస్తారు. ఇంటాబయట సమస్యలు కొంత బాధిస్తాయి. వ్యాపారాలు మందకోడీగా సాగుతాయి. ఉద్యోగులకు పనిఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడుతాయి. ఆకస్మిక ప్రయాణా సూచనలున్నవి.

కన్య: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయులతో గృహమున ఆనందంగా గడుపుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

తుల: దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు కొంత చికాకు పరుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడుతాయి.

వృశ్చికం: పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి.

ధనస్సు: వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. బంధు వర్గం నుంచి ధన పరమైన ఒత్తిడులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. నిరుద్యోగులకు లభించిన అవకాశములు సద్వినియోగం చేసుకోవడంలో విఫలమౌతారు.

మకరం: వృత్తి, వ్యాపారాలలో సమస్యలు తొలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. సన్నిహితుల నుండి అత్యంత కీలక సమాచారం అందుతుంది.

కుంభం: ఉద్యోగులు నూతనోత్సాహం పనిచేసి ప్రశంసలు అందుకుంటారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు లాభసాటిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

మీనం: వ్యాపారాలలో ఊహించని మార్పులు ఉంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు అధికమౌతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ధనదాయ మార్గాలు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.





# ఘనంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

**మొదటి పేజీ తరువాయి**

సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. అలాగే, కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల పారిశ్రామికాభివృద్ధికి కీలకంగా మారనున్న వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సును ప్రారంభిస్తారు. ఈ సదస్సు స్థానిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు. అంతేకాకుండా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అహ్మదాబాద్ మెట్రో రెండో దశను ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఇక, జనవరి 12న జర్మన్ ఛాన్సలర్ మెర్జ్‌తో కలిసి సబర్మతి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అంతర్జాతీయ దౌత్య సంబంధాలను పటిష్టం చేయడంలో భాగంగా ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. చివరగా, అహ్మదాబాద్‌లో అత్యంత వేడుకగా జరిగే అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవంలో ప్రధాని పాల్గొంటారు.

### దేశమంతా ఏకమైంది

సోమనాథ్‌లో ఉండటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇది మన నాగరిక ధైర్యానికి గర్వకారణమైన చిహ్నం. నా ఈ పర్యటన సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సమయంలో జరిగింది. 1026లో సోమనాథ్ ఆలయంపై జరిగిన మొదటి దాడికి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశమంతా ఏకమైంది. సోమనాథ్ ప్రజల ఆప్యాయత, ప్రేమకు నేను కృతజ్ఞుడను.– ప్రధాని మోదీ



## పంచ చేనులోనే హిందూ రైతు హత్య

**మొదటి పేజీ తరువాయి**

మానవ హక్కుల గ్రూపులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చాయి. సింధ్ ప్రావిన్స్‌లో ప్రభుత్వం, స్థానిక యంత్రాంగానికి వ్యతిరేకంగా భారీ నిరసనలు చేపట్టారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, అతనిపై హత్య, ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. "ఇది కేవలం ఒక వ్యక్తి హత్య కాదని.. మానవత్వంపై జరిగిన దాడి" అని పాకిస్థాన్ దరావర్ ఇత్తెహాద్ చైర్మన్ శివ కచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## అప్పు కట్టలేదని నోట్లో విషం పోసి..!

**మొదటి పేజీ తరువాయి**

వేళ షరియత్ పూర్ జిల్లాలో ఖోకన్ చంద్రదాస్ అనే వ్యక్తిపై దాడిచేసి చంపారు. జనవరి 5న హిందూ వార్త సంపాదకుడు రాణా కాంతి బైరాగిని కాల్చిచంపారు. అనంతరం నర్సింగి జిల్లాలో వ్యాపారి మణి చక్రవర్తి ప్రాణాలు తీశారు. తాజాగా మహాపాత్ర అనే యువకుడిని విషం ఇచ్చి చంపారు. బంగ్లాదేశ్‌లో ఇంత పెద్దఎత్తున హిందువులపై దాడులు జరగడం భారత్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

## టీజీ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ

**మొదటి పేజీ తరువాయి**

చేయాలనే లక్ష్యంతో పార్టీ ఇప్పటికే కార్యాచరణను ప్రారంభించిందని ఆ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, సాధ్యమైనన్ని స్థానాలలో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడం, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భావజాలాన్ని, ఆయన ఆశయాలను, తెలంగాణ ప్రాంతం పట్ల ఆయనకున్న అనుబంధాన్ని ప్రజలకు చేరవేయడం, తద్వారా తెలంగాణలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తున్న జనసైనికులు, వీరమహిళలు చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# విషమిచ్చి చంపండి

**మొదటి పేజీ తరువాయి**

ఆవేదన వ్యక్తం చేశారు. తనను వేధించడం ఇంకా సరిపోదు అనుకుంటే ఒకేసారి నాకింత విషమిచ్చి చంపేయండని హాట్ కామెంట్ చేశారు. తాను మంత్రి అయ్యాక నల్లగొండ జిల్లాలో నలుగురు కలెక్టర్లు ట్రాన్స్‌ఫర్ అయ్యారని, ఐఏఎస్‌ల బదిలీ వ్యవహారం సీఎం చూసుకుంటారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుందని వివరణ ఇచ్చారు. మహిళా అధికారులపై ఆరోపణలపై ప్రభుత్వం తరపున సమగ్ర దర్యాప్తు జరపాలని సీఎంని కోరుతున్నానని అన్నారు.

### జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై వచ్చిన నిరాధార కథనాలను ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎదుటి వ్యక్తిపై బురద జల్లే ఇలాంటి సంప్రదాయం ఏమాత్రం మంచిది కాదని ఆయన అన్నారు. ఎవరైనా దురుద్దేశపూర్వకంగా అలాంటి వార్తలు రాయాలని ప్రోత్సహించినా అది సరికాదని అన్నారు. మంత్రిపై అలాంటి రాతలకు ఎవరైనా ప్రోత్సహిస్తే అది చాలా పెద్ద తప్పు అవుతుందని అన్నారు. ఉద్దేశపూర్వకంగా కథనం రాసిన వారితో పాటు ప్రేరేపించిన వారిది కూడా తప్పే అన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంచలంచెలుగా ఎదిగిన నాయకుడని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ఒక చరిత్ర అని పేర్కొన్నారు. ఒక ఆడ, మగ మాట్లాడితే పెడార్థాలు తీస్తారా



అంటూ ఆయన దుమ్మెత్తి పోశారు. పనిగట్టుకుని బురద జల్లడానికి ఇదేమైనా ప్రజా సమస్యనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు రాయడానికి బదులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను బయటకు తీసుకు రావాలని సూచించారు. చేతిలో కలం ఉందని ఇష్టారీతిన రాతలు రాస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అప్పులు చేసి ప్రజలకు సేవ చేసే మమ్మల్ని బద్నాం చేయాలని చూస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆల్మంట్ కిడ్ సిరప్ వాడొద్దు

**మొదటి పేజీ తరువాయి**

ఈ బ్యాచ్ సిరప్ ఎవరి వద్దనైనా ఉంటే.. వాడకం ఆపేయాలని.. అలాగే మార్కెట్‌లోనూ విక్రయాలను నిలిపివేయాలని తెలంగాణ డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం ఆదేశించారు. పిల్లలకు వాడే సిరప్ కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




# చిరు సినిమా టికెట్ రేట్ల పెంపు

**మొదటి పేజీ తరువాయి**

పెంచుతున్నారంటూ కోర్టులో పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు హౌస్ మోషన్ పిటిషన్ విచారణకు నిరాకరించింది. కోర్టు పని దినాల్లో మాత్రమే పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. హైకోర్టు సెలవు తర్వాత విచారిస్తామని చెప్పడంతో న్యాయవాది విజయ్ గోపాల్ మరోసారి పిటిషన్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది.

### నాకేం తెల్వదు: మంత్రి కోమటిరెడ్డి

సినిమా టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోల వ్యవహారంపై సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి కానుకగా విడుదలైన 'రాజాసాబ్' చిత్రంతో పాటు ఇతర సినిమాల టికెట్ల రేట్ల పెంపునకు తాను ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తేల్చిచెప్పారు. ఈ వ్యవహారంతో తనకు ఏమాత్రం సంబంధం లేదని, అసలు సినీ పరిశ్రమకు సంబంధించిన ఫైళ్లేవీ తన వద్దకు రావడం లేదని స్పష్టం చేశారు. పుష్ప–2 సినిమా విడుదల సమయం నుంచే టికెట్ల రేట్ల పెంపు, బెనిఫిట్ షోల కోసం ఎవరూ తనను సంప్రదించవద్దని, దరఖాస్తులు కూడా చేసుకోవద్దని నిర్మాతలకే కరాఖండీగా చెప్పినట్లు మంత్రి వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలు, తాజా వివాదాల నేపథ్యంలో మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టికెట్ ధరల పెంపు జీవోలతో తనకు ప్రమేయం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. గతంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద 'పుష్ప–2' ప్రీమియర్ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రమాదంలో ఓ మహిళ మరణించడం తన మనసును గాయపరిచిందని, అప్పటి నుంచే సినిమా వ్యవహారాలపై దృష్టి తగ్గించానని వివరించారు. ఆ ఘటనలో గాయపడిన బాలుడికి వైద్య చికిత్సతో పాటు చదువు బాధ్యతను తానే తీసుకున్నానని, బాధితుడికి రూ.25 లక్షల చెక్ అందించి ఆదుకున్నానని గుర్తుచేశారు. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే కఠినంగా వ్యవహరిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న 'రాజాసాబ్' సహా సంక్రాంతి సినిమాలకు సంబంధించిన ఏ దస్త్రం (ఫైల్) తన పరిశీలనకు రాలేదని మంత్రి స్పష్టం చేశారు. రేట్ల పెంపు కోసం దరఖాస్తులు కూడా పెట్టుకోవద్దని తానే స్వయంగా చెబుతున్నానని తెలిపారు. తన కార్యాలయానికి సినీ పెద్దలు ఎవరూ రావడం లేదని, తాను ఎవరినీ కలవడం లేదని చెప్పారు. పరిశ్రమలో కేవలం పేద కార్మికులు, కళాకారుల సమస్యలు ఉంటేనే జోక్యం చేసుకుంటానని, వాణిజ్యపరమైన టికెట్ రేట్ల అంశాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు.





# ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేయాలి

## 'ఈవార్తలు' క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 10 (ఈవార్తలు): పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం 'ఈవార్తలు' దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో మాట్లాడిన ఆయన.. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే కోణంలో జర్నలిస్టుల వార్తలు ఉండాలని చెప్పారు. 'ఈవార్తలు' దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవార్తలు దినపత్రిక దినపత్రిక చైర్మన్ బొమ్మకంటి గంగాధర్, ఎడిటర్ శ్రావణ్ కుమార్, జగిత్యాల జిల్లా పద్మశాలీ నేత చెట్పల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఈవార్తలు న్యూస్ కవరేజీ అద్భుతం

## క్యాలెండర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల, జనవరి 10 (ఈవార్తలు): అనతికాలంలోనే ఈవార్తలు దినపత్రిక ప్రజలకు చేరువైందని, పాఠకులకు నచ్చే విభిన్నమైన కథంశాలను అందిస్తోందని మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి అన్నారు. శనివారం పత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రాబోయే రోజుల్లో 'ఈవార్తలు' దినపత్రిక మరింత గొప్పగా వార్తలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవార్తలు దినపత్రిక దినపత్రిక చైర్మన్ బొమ్మకంటి గంగాధర్, ఎడిటర్ శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై వీడియోలు సరికాదు

### మీడియా సంస్థలు విచక్షణతో మెలగాలి: మహేశ్ గౌడ్

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): తెలంగాణకు చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో ప్రసారమైన కథనంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని, వాస్తవాలకు దూరంగా ఇలాంటి వార్తలు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి మంత్రులు, అధికారులు ఈ స్థాయికి చేరుకుంటారని, అలాంటి వారిపై నిరాధారమైన వార్తలు ప్రచురించడం మానేయాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా, శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నిస్తూ, రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని, ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేము రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమయ్యారని, కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్ రావు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు సాధించామని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించామని... మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందని అన్నారు.

# సజ్జల వల్లే జగన్ 151 నుంచి 11

వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సజ్జల ఇచ్చిన సలహాల వల్లే జగన్ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు గజగజ వణికిపోయే స్థితి రావడానికి సజ్జలే కారణమని చెప్పారు. సజ్జల కనీసం వార్డు మెంబర్ కూడా కాలేదని, అలాంటి వ్యక్తి చట్టసభలు, ప్రభుత్వ విధానాలు, పాలసీలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సజ్జల స్వయంగా మాట్లాడుతున్నారా లేక తాడేపల్లి ప్యాలెస్‌లో బందీగా ఉన్న జగన్ మాట్లాడిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ రోజు సజ్జల మాటలు చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందని, సొంత పార్టీలోనే ఆయనను ఛీ కొడుతున్నారని, గత ప్రభుత్వాన్ని నాశనం చేసింది సజ్జలేనని వైసీపీ నాయకులు బహిరంగంగా చెబుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# జర్నలిస్టులకు అన్యాయం చేయం

## జీవో 252లో మార్పులు చేస్తాం.. మంత్రి పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ ప్రజా ప్రభుత్వం అన్నివిధాలా అండదండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గాని, చిన్నబుచ్చాలనిగాని తమ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని స్పష్టం చేశారు. జీవో 252పై శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమావేశంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23 వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈసారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటివరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం జరిగిందని పలుమార్లు సమావేశాలు నిర్వహించామని అంతేగాక దేశ వ్యాప్తంగా ఉన్న నియమ నిబంధనలను పరిశీలించడం జరిగిందని.. ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతీ ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. తాము



అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడం లేదని కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను ఖచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీని వలన అసలైన పత్రికలు, పాత్రికేయులకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన గాక జనాభా వారీగా అక్రిడిటేషన్‌లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని, దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామని క్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే డిజిటల్ మీడియా కార్డులు మంజూరు చేశామని తెలియజేశారు. సమావేశంలో పలువురు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు ఇండ్ల స్థలాలు, పెన్షన్, బస్‌పాసులు, పాత్రికేయులకు బీమా తదితర అంశాలను ప్రస్తావించగా మంత్రి పొంగులేటి సావధానంగా వారికి సమాధానమిచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై కొంతమంది ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై మంత్రి స్పందిస్తూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించడం జరిగిందన్నారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కొట్టివేయడంతో సమస్య మొదటికి వచ్చిందని అయినా కూడా ఇండ్ల స్థలాల విషయంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి, ఐఅండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, సీపీఆర్‌వో జీ మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

## వెంటనే తప్పుడు కథనాన్ని తొలగించాలి.. వార్తా కథనంపై ఐఏఎస్, ఐపీఎస్‌ల ఫైర్

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): మహిళా ఐఏఎస్ అధికారిపై వస్తున్న తప్పుడు కథనాలను తెలంగాణ ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. తప్పుడు కథనాలు ప్రసారం చేసిన మీడియా సంస్థలపై ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా ఐఏఎస్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాన్ని తక్షణమే అన్ని ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించాలని హెచ్చరించింది. లేనిపక్షంలో సదరు మీడియా హౌజ్‌పై న్యాయపరంగా ముందుకు వెళ్తామని వార్నింగ్ ఇచ్చింది. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అటు.. మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొన్ని మీడియా సంస్థలు బాధ్యతారహితమైన, దురుద్దేశపూరిత కథనాలను ప్రసారం చేయడాన్ని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ నిరాధార ఆరోపణలను ఖండిస్తూ, ఐఏఎస్ అధికారుల సంఘానికి తమ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సంచలనం సృష్టించడం, పరువు తీయడం అనే ఏకైక లక్ష్యంతో జర్నలిజం ముసుగులో కొందరు మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఐపీఎస్ సంఘం ఆరోపించింది. ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలు, కల్పిత కథనాలతో మహిళా అధికారులను లక్ష్యంగా చేసుకోవడం అత్యంత హేయమని, ఇది తిరోగమన, స్త్రీద్వేషపూరిత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఇలాంటి చర్యలు రాజ్యాంగబద్ధ పాలన, చట్టబద్ధత, ప్రజాసేవ గౌరవానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని అభిప్రాయపడింది. మహిళా అధికారులు ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిజాయితీ, ధైర్యంతో తమ విధులను నిర్వర్తిస్తున్నారని సంఘం గుర్తుచేసింది. కేవలం ఊహాగానాలు, లీకైన లేదా కల్పిత సమాచారంతో వారి ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూడటం నైతికంగా, చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఇలాంటి చర్యల వల్ల వ్యవస్థల మనోస్థైర్యం దెబ్బతినడమే కాకుండా, పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రసారమైన ఆరోపణలన్నీ అవాస్తవమని, దురుద్దేశపూరితమైనవని ఐపీఎస్ సంఘం తేల్చి చెప్పింది. ఇది అధికారుల వ్యక్తిగత గోప్యత, వృత్తిపరమైన గౌరవానికి తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, మీడియా ట్రయల్ కిందకు వస్తుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని తెలిపింది. ఐఏఎస్ అధికారుల సంఘంతో కలిసి తాము ఈ అంశంపై పోరాడతామని పేర్కొంటూ, సంబంధిత మీడియా సంస్థలు తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఐపీఎస్ సంఘం డిమాండ్ చేసింది. వివాదాస్పద కథనాలను అన్ని డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని కోరింది. భవిష్యత్తులో ఇలాంటి నిరాధార, కల్పిత కథనాలను ప్రసారం చేసే మీడియా సంస్థలు లేదా వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారి గౌరవం, ముఖ్యంగా మహిళా అధికారుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఐపీఎస్ సంఘం స్పష్టం చేసింది.



# విద్యార్థులకు సీపీఆర్ నేర్పించాలి

### వైద్యులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన

### ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి హాజరు

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలామంది ప్రాణాలు కాపాడవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్‌నని అన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాలసీలను మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఇందుకోసం వైద్యులు సూచనలు ఇవ్వాలని కోరారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పుడూ మరిచిపోకూడదని అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, అదే సమయంలో ప్రజల నాడిని పట్టుకోవడం మరిచిపోవద్దని సూచించారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఆరోగ్య రంగంలో ఆవిష్కరణల్లో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ముఖ్యమంత్రి అన్నారు.

# మాజీ ఐపీఎస్ భార్యకు 2.58 కోట్లు టోకరా

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఓ మాజీ ఐపీఎస్ అధికారి భార్యకు సైబర్ నేరగాళ్లు రూ.2.58 కోట్ల మేర టోకరా వేశారు. బాధితురాలి భర్త గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తించినట్లు సమాచారం. ట్రేడింగ్ చిట్కాలు చెబుతామంటూ సైబర్ నేరగాళ్లు తొలుత ఆమెకు వాట్సాప్ సందేశం పంపించారు. ఆమెకు స్టాక్ మార్కెట్‌పై అవగాహన లేకపోవడంతో తన భర్త నెంబరును ఆ వాట్సాప్ గ్రూప్‌లో చేర్పించారు. తాము సూచించిన స్టాక్స్‌లో పెట్టుబడులు పెడితే 500 శాతం లాభాలు వస్తాయని, ఇది సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని చెప్పడంతో పాటు ఆమెను నమ్మించడానికి నకిలీ సెబీ సర్టిఫికెట్లు పంపించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు డిసెంబర్ 24వ తేదీ నుంచి ఈ నెల 5 వరకు 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్లు పెట్టుబడులు పెట్టారు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టిన బాధితురాలు, మరింత డబ్బు పెట్టేందుకు ఆసక్తి కనబరచలేదు. దీంతో మరిన్ని పెట్టుబడులు పెట్టాలంటూ ఆమెపై ఒత్తిడి చేశారు. అదనంగా పెట్టుబడులు పెట్టకుంటే ఇప్పటి వరకు పెట్టిన డబ్బు అంతా పోతుందని బెదిరించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 3 వేల కోట్ల భూమికి హైడ్రా రక్షణ

మియాపూర్/రంగారెడ్డి, జనవరి 10 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. శేరిలింగంపల్లి మండలం, మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జాకు గురవుతోందని గతంలోనే హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు గతంలోనే ఐదు ఎకరాలను స్వాధీనం చేసుకుని, చెరువు కట్టపై నిర్మించిన 18 అక్రమ షెట్టర్లను తొలగించారు. అయితే, ఇదే భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధిత సబ్-రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారనే వార్తల నేపథ్యంలో హైడ్రా అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. ఈ విచారణలో, సర్వే నంబర్ 159కి చెందిన పత్రాలను ఉపయోగించి సర్వే నంబర్ 44లోని మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తాజాగా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా, ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసింది.



# ఇన్‌స్టా యూజర్లకు అలర్ట్..

ఇన్‌స్టాగ్రామ్ యూజర్లకు బిగ్ అలర్ట్. సుమారు 1.75 కోట్ల మంది యూజర్ల సెన్సిటివ్ డేటా లీక్ అయినట్లు సైబర్ నిపుణులు తెలిపారు. యూజర్ల పేర్లు, మెయిల్స్, ఫోన్ నెంబర్లు, అడ్రస్‌లు డార్క్ వెబ్‌లో అమ్మకానికి పెట్టినట్లు వెల్లడించారు. డేటా లీక్ వల్ల హ్యాకర్లు ఐడెంటిటీ థెఫ్ట్‌కు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముందు జాగ్రత్తగా యూజర్లు తమ పాస్‌వర్డ్ మార్చుకోవాలని సూచించారు. అంతేకాదు.. ఇన్‌స్టా పేరుతో వస్తున్న ఫేక్ మెయిల్స్ ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదన్నారు. భారీ డేటా ఉల్లంఘన జరిగింది. దాదాపు 17.5 మిలియన్ల ఇన్‌స్టాగ్రామ్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ అయ్యింది. సున్నితమైన వివరాలు ఇప్పుడు డార్క్ వెబ్ ఫోరమ్‌లలో చక్కర్లు కొడుతున్నాయి. మాల్వేర్ బైట్స్‌లోని సైబర్ సెక్యూరిటీ పరిశోధకులు మొదటగా దీన్ని గుర్తించారు. ఈ వారం ప్రారంభంలో "సోలోనికు అనే మారు పేరుతో పని చేస్తున్న ఒక సైబర్ నేరగాడు హ్యాకింగ్ ఫోరమ్‌లో హ్యాక్ చేసిన డేటాసెట్‌ను పోస్ట్ చేశాడు. 17వీ గ్లోబల్ యూజర్స్-2024 లీకు అనే టైటిల్ లో ఉన్న ఈ లిస్ట్ లో ఫైల్స్ రూపంలో ఫార్మాట్ చేయబడిన 17.5 మిలియన్ల రికార్డులు ఉన్నాయి" అని సైబర్ నిపుణులు వెల్లడించారు.






ఈవార్తలు దినపత్రిక 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఈవో శ్రీకాంతారావు. చిత్రంలో ఈవార్తలు దినపత్రిక చైర్మన్ బొమ్మకంటి గంగాధర్, ఎడిటర్ శ్రావణ్ కుమార్, ఏఈవో, సూపరింటెండెంట్, మల్యాల మండల రిపోర్టర్ వెంకటేశ్.




ఈవార్తలు దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో మల్యాల మండల ఎస్సై నరేశ్ కుమార్, ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్, ఈవార్తలు దినపత్రిక చైర్మన్ బొమ్మకంటి గంగాధర్, ఎడిటర్ శ్రావణ్ కుమార్, మల్యాల మండల రిపోర్టర్ వెంకటేశ్.




ఈవార్తలు దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో జగిత్యాల జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు భోగ వేంకటేశ్వర్లు, ఈవార్తలు దినపత్రిక చైర్మన్ బొమ్మకంటి గంగాధర్, ఎడిటర్ శ్రావణ్ కుమార్.

## అడ్డగోలుగా టికెట్ ధరలు పెంచితే చర్యలు

**ప్రైవేట్ ట్రావెల్స్‌కు ఏపీ రవాణా శాఖ వార్నింగ్**

విజయవాడ, జనవరి 10 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ రద్దీని ఆసరాగా తీసుకుని ప్రయాణికులను నిలువు దోపిడీ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులను ఏపీ రవాణా శాఖ హెచ్చరించింది. టికెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని, ఆర్టీసీ ఛార్జీలకన్నా 50 శాతం గరిష్ఠంగా పెంచుకోవచ్చని తెలిపింది. అంతకుమించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు. ధరల పెంపునకు సంబంధించి నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 18 వరకు అన్ని జిల్లాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభి బస్, రెడ్ బస్ వంటి యాప్‌ల ద్వారా కూడా ఆయా ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఎంత టికెట్ ధరలు వసూలు చేస్తున్నాయో పర్యవేక్షిస్తున్నామని, అధిక ధరలు ఉంటే కేసులు పెడతామని చెప్పారు. అధిక ధరలు వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్ నంబరు 9281607001ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెంబర్ ను అన్ని బస్సుల్లో డిస్ ప్లే చేసేలా ట్రావెల్స్ యజమానులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

## పెరిగిన ఎస్బీఐ ఏటీఎం చార్జీలు

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు షాకిచ్చింది. ఏటీఎం లావాదేవీలపై ఛార్జీలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్‌ఛేంజ్ రుసుములు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు తెలిపింది. పెంచిన ఈ కొత్త ఛార్జీలు 2025 డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ మార్పుల ప్రభావం ప్రధానంగా సేవింగ్స్, శాలరీ ఖాతాదారులపై పడనుంది. సవరించిన నిబంధనల ప్రకారం.. ఎస్‌బీఐ ఖాతాదారులు ఉచిత పరిమితి దాటిన తర్వాత ఇతర బ్యాంకుల ఏటీఎంలలో చేసే నగదు విత్‌డ్రాయల్‌పై ఇకపై రూ. 23తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఛార్జీ రూ. 21 ( జీఎస్టీ అదనం)గా ఉండేది. అలాగే, బ్యాలెన్స్ చెకింగ్, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్-ఫైనాన్షియల్ లావాదేవీలపై ఛార్జీని రూ. 10 నుంచి రూ. 11కి (జీఎస్టీ అదనం) పెంచారు. సేవింగ్స్ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీల పరిమితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు.

## యూఎస్ వీసా ప్రీమియం ఫీజుల పెంపు

**మార్చి 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఫీజులు**

**భారతీయ విద్యార్థులు, టెక్కీలపై అధిక భారం**

న్యూయార్క్: అమెరికాలో ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం వెళ్లే భారతీయులకు ముఖ్య గమనిక. హెచ్-1బీ సహా పలు కీలక ఇమ్మిగ్రేషన్ సేవల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులను పెంచుతున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. పెంచిన ఈ ఫీజులు మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయం భారతీయ విద్యార్థులు, నిపుణులపై నేరుగా ప్రభావం చూపనుంది. 2023 జూన్ నుంచి 2025 జూన్ మధ్య నమోదైన ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఫీజులను సవరించినట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది. ఈ పెంపు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఏజెన్సీ కార్యకలాపాలను మెరుగుపరచడానికి, వీసాల జారీ ప్రక్రియను వేగవంతం చేయడానికి, పేరుకుపోయిన దరఖాస్తులను పరిష్కరించడానికి ఉపయోగిస్తామని వెల్లడించింది. కొత్త ఫీజుల ప్రకారం హెచ్-1బీ, ఎల్-1, ఓ-1 వంటి కీలక వర్క్ వీసాలకు సంబంధించిన ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు 2,805 డాలర్ల (రూ. 2.53 లక్షలు) నుంచి 2,965 డాలర్ల (రూ. 2.67 లక్షలు)కు పెరగనుంది. ఇదే ఫీజు ఎంప్లాయ్‌మెంట్ ఆధారిత గ్రీన్ కార్డ్ పిటిషన్లకు (ఫామ్ ×-140) కూడా వర్తిస్తుంది. విద్యార్థులకు సంబంధించిన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ), స్టెమ్-ఓపీటీ దరఖాస్తుల ఫీజు 1,685 డాలర్ల (రూ. 1.52 లక్షలు) నుంచి 1,780 డాలర్ల (రూ. 1.60 లక్షలు)కి పెరిగింది. ఎఫ్-1, జే-1 విద్యార్థుల స్టేటస్ మార్పు దరఖాస్తుల ఫీజు 1,965 డాలర్ల (రూ. 1.77 లక్షలు) నుంచి 2,075 డాలర్ల (రూ. 1.87లక్షలు)కు చేరింది.

## ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఔట్ విజయవంతంగా మూసివేత..



కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో వారం రోజులుగా ప్రజలను భయాందోళనలకు గురిచేసిన గ్యాస్ బ్లోఔట్‌ను ఓఎన్జీసీ నిపుణులు విజయవంతంగా మూసివేశారు. ఈ పరిణామంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇరుసుమండ బ్లోఔట్‌ను విజయవంతంగా అదుపులోకి తెచ్చేందుకు అహర్నిశలు శ్రమించిన ఓఎన్జీసీ నిపుణుల బృందానికి, జిల్లా యంత్రాంగానికి, ఎంపీ హరీశ్ బాలయోగికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యవేక్షణ, నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం వేగంగా, సానుభూతితో స్పందిస్తుందని చెప్పడానికి ఇది నిదర్శనమని లోకేశ్ పేర్కొన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి కూడా ఈ విషయంపై స్పందించారు. అతి తక్కువ సమయంలో బ్లోఔట్‌ను మూసివేసిన బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపారని, సీఎంవో నిరంతరం పర్యవేక్షించిందని చెప్పారు. డబుల్ ఇంజన్‌తో కూడిన ఎన్డీఏ సర్కార్ బుల్లెట్ వేగంతో పనిచేస్తుందని చెప్పడానికి ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తన జిల్లా ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హరీశ్ బాలయోగి భరోసా ఇచ్చారు. ఈ బ్లోఔట్ మూసివేతతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# జగన్ అనాగరికుడు

**నాగరికత తెలిస్తే నదులపై దుష్ప్రచారం చేయడు.. తెలుగు రాష్ట్రాలు నీటి కోసం గొడవ పడొద్దు**

**పట్టిసీమతోనే రాయలసీమలో ఉద్యానం అభివృద్ధి: చంద్రబాబు**



అమరావతి, జనవరి 10 (ఈవార్తలు): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదుల గురించి ఇలా దుష్ప్రచారం చేయరని, అసలు సింధు నాగరికత ఎలా ఏర్పడిందో తెలుసుకుంటే మంచిదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలైన దేశ రాజధాని దిల్లీ, లండన్ వంటివన్నీ నదీ తీరాల వెంబడే అభివృద్ధి చెందాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నదీ గర్భం, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమకు బుద్ధి చెప్పినా రాజధాని విషయంలో ఇప్పటికీ విషం చిమ్మడం మానలేదని విమర్శించారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన చంద్రబాబు, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. నీటి విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు పడితే అంతిమంగా నష్టపోయేది తెలుగు ప్రజలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. "రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుంది? తెలంగాణతో కలిసి సహకరించుకుని మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయి" అని సూచించారు. నీటిని సమర్థవంతంగా వాడుకోవడం వల్లే రాయలసీమ స్వరూపం మారిందని, పట్టిసీమ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే రాయలసీమలో ఉద్యాన విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం దేశంలోనే ఉద్యాన (హార్టికల్చర్) రంగంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కేవలం స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఆపేసిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 2020లో కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్ల బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో నీటి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత అనేదే లేకుండా చూసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.



## చంద్రబాబుకు మంతెన ధన్యవాదాలు

**ఏపీ సీఎంతో మర్యాదపూర్వక భేటీ**

తాడేపల్లి, జనవరి 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారుగా ఇటీవల నియమితులైన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు శనివారం సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన ఆయన, తనకు సలహాదారుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంతెన సత్యనారాయణ రాజుకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి వైద్య రంగంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుకున్న అనుభవాన్ని వినియోగించుకోవాలని భావించిన ప్రభుత్వం, ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ డిసెంబర్ 29న అధికారికంగా ఉత్తర్వులు (జీవో) జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, డాక్టర్ రాజు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన విధానాలపై ప్రభుత్వానికి డాక్టర్ రాజు సలహాలు, సూచనలు అందించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి సిద్ధమైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ మంతెన సత్యనారాయణ రాజు విశేష ప్రజాదరణ పొందారు. ఆయన అమరావతి సమీపంలో 'మంతెన ఆరోగ్యాలయం' పేరుతో ప్రకృతి చికిత్సాలయం, పరిశోధన కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# నూతన పాలక వర్గానికి ఘన సన్మానం



మల్యాల, జనవరి 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేట గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ మోటే రమేష్ వార్డు సభ్యులు మోటే మహేశ్, బండ కవిత లింగస్వామి, గౌరిగే పారిజాత శేఖర్ను రామన్నపేట కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప గుడి ఆవరణలో ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో సిందం లింగయ్య, మిర్యాల మల్లేశ్, మోటే మల్లేష్, ఎర్ర అంజయ్య, కడగంచి ఐలయ్య, బర్ల డేవిడ్, గోరిగే కృష్ణ, మల్గా లింగయ్య, మోటే రాములు, శీలం యాదయ్య, గౌరిగే సోములు, చిన్నం రమేష్, మోటె బీరప్ప, వల్లూరి ఐలయ్య, మోటె నరసింహ, గౌరిగే నర్సింహ, మోటే గోపాల్, బంగారి మొగులయ్య, కొండే వెంకటేష్, మోటే బోలెష్, బె డిద లింగస్వామి, బెడిద మల్లేష్, మిర్యాల బిక్షం, బర్ల స్వామి, మోటె క్రాంతి, తోటకూరి కృష్ణ, చిన్నం వేణు, మోటి అనిల్, మోటే మదన్, మోటే చక్రపాణి, మిరియాల లింగస్వామి, మోడీ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సూర్య ధన్వంతరి ఆలయ రథసప్తమి పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, జనవరి 10 (ఈవార్తలు): జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి సహిత ధనలక్ష్మి దేవాలయ రథసప్తమి కార్యక్రమాల ఆహ్వాన పోస్టర్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, ఆలయ ఫౌండర్ అండ్ చైర్మన్ వడ్లగట్ట రాజన్న, అధ్యక్షుడు ముత్యాల రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, సహాయ కోశాధికారి వడ్లగట్ట గోపి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







## పద్మశాలీలు అన్ని రంగాల్లో ఎదగాలి: కందగట్ల స్వామి

హైదరాబాద్, జనవరి 10: పద్మశాలీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. అఖిల భారత పద్మశాలి ఇంజనీర్స్ విభాగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య అధ్యక్షతన శనివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. పద్మశాలీయులు సమాజ సేవకు కొంత సమయం ఇచ్చి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పద్మశాలీలు సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పద్మశాలీలు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలి ఇంజనీర్స్ విభాగ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పుట్ట పాండురంగయ్య, మసున మోహన్ నారాయణ, చిలుకూరి చంద్రమోహన్, కొక్కుల దేవేందర్, మోతుకూరి కృష్ణ, చింతకింది విజయ ప్రసాద్, ఈడెం సంతోషి, వెంగళ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## అసభ్య వ్యాఖ్యలను కాంగ్రెస్ సమర్థిస్తుందా?

**మహిళా నాయకురాలి వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి**

హైదరాబాద్, జనవరి 10 (ఈవార్తలు): సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, సమాజానికి సంబంధించిన అంశాలపై తన అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా స్పష్టంగా చెప్పే వ్యక్తిగా సింగర్ చిన్మయికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా మహిళల హక్కులు, లైంగిక వేధింపులపై చిన్మయి చేసే వ్యాఖ్యలు తరచూ చర్చకు దారి తీస్తుంటాయి. ఇక, ఇటీవల 'దండోరా' ఈవెంట్‌లో శివాజీ హీరోయిన్లపై చేసిన వ్యాఖ్యలు పెద్ద వివాదంగా మారిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై చిన్మయి తీవ్రంగా స్పందించగా, అనసూయ కూడా అదే స్థాయిలో శివాజీ వ్యాఖ్యలను ఖండిస్తూ సోషల్ మీడియాలో వరుస పోస్టులు చేసింది. దీంతో ఈ వివాదం మరింత ముదిరి, సినీ వర్గాలకే కాదు రాజకీయ వర్గాలకూ విస్తరించి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఓ టీవీ డిబేట్‌లో కాంగ్రెస్‌కు చెందిన మహిళా నాయకురాలు చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. దీనిపై తాజాగా చిన్మయి ఘాటు ట్వీట్ చేస్తూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. 'టెలివిజన్ చర్చల్లో ఇలాంటి ప్రవర్తనను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా? లేక ఈ తరహా ఆలోచనలకు పార్టీ ఉన్నత నాయకత్వం మద్దతు ఇస్తుందా?' అంటూ ఆమె ప్రశ్నించింది. ఓ సినిమా ఈవెంట్‌లో నటుడు తన సహనటిపై బూతులు తిట్టిన ఘటన తర్వాత, మహిళల దుస్తులు, నైతికతపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పెద్ద చర్చ మొదలైందని ఆమె గుర్తు చేసింది. దీనిని కొందరు 'ఆందోళన'గా చిత్రీకరించడాన్ని కూడా ఆమె తప్పుబట్టింది. టీవీ ఛానెళ్లలో జరిగిన చర్చల్లో వినిపించిన అసభ్య పదజాలం మీడియా స్థాయిని దిగజార్చిందని చిన్మయి విమర్శించింది. మహిళల దుస్తులపై ఆంక్షలు విధిస్తే లైంగిక వేధింపులు ఆగిపోతాయన్న భావన పూర్తిగా తప్పని అనేక మంది మహిళలు చెబుతున్నా, వాటిని పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొంది.



# ఆందోళన చేస్తే ఉరి శిక్షే!

స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఇరాన్ ప్రభుత్వం





టెహ్రాన్: ఆర్థిక సంక్షోభంతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో నిరసనలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. గత రెండు వారాలుగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. నిరసనల్లో పాల్గొన్న వారికి మరణశిక్ష తప్పదని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

ఆందోళనకారులను దేశ శత్రువులుగా పరిగణిస్తామని, వారిపై దేశద్రోహం, అభద్రత సృష్టించడం వంటి అభియోగాల కింద మరణశిక్ష విధిస్తామని ఇరాన్ అటార్నీ జనరల్ మొహ్మద్ మోవాహెది ఆజాద్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి దయ చూపబోమని ఆయన తేల్చిచెప్పారు. ఈ అణచివేత చర్యలకు సుప్రీం లీడర్ కూడా మద్దతు పలికారు. నిత్యావసరాల ధరల పెరుగుదల, కరెన్సీ విలువ పతనం కావడంతో ఇరాన్ ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. భద్రతా బలగాల చర్యల కారణంగా ఇప్పటివరకు కనీసం 72 మంది మరణించారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని మానవ హక్కుల సంస్థలు చెబుతున్నాయి. అయితే మృతుల సంఖ్య 200 దాటవచ్చని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వం ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను నిలిపివేయడంతో వాస్తవ పరిస్థితులు బయటకు తెలియడం లేదు. మరోవైపు, ఇరాన్ ప్రభుత్వ వైఖరిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. శాంతియుత నిరసనకారులపై హింసకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "అధ్యక్షుడితో (ట్రంప్ తో) ఆటలాడొద్దు" అంటూ అమెరికా విదేశాంగ శాఖ కూడా ఇరాన్ కు గట్టి వార్నింగ్ ఇచ్చింది. ప్రజాగ్రహం పెరుగుతుండగా, ప్రభుత్వం అణచివేతను తీవ్రతరం చేయడంతో ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

## మన పూర్వికులు ఎవరికీ హాని చేయలేదు

**జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్**



న్యూఢిల్లీ: చరిత్రలో ఇతర దేశాలు మనపై దాడులు చేసి ఆలయాలను, గ్రామాలను ధ్వంసం చేసినప్పటికీ, మన పూర్వీకులు ఏ దేశ ప్రజలకూ ఎటువంటి హాని చేయలేదని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ట కార్యక్రమంలో ఆయన యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మన దేశ చరిత్ర నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతీకారం ఎప్పుడూ మంచిది కాదని, దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, దేశ చరిత్రపై గతంలో జరిగిన అణిచివేతకు మనం ప్రతీకారం తీర్చుకోవాలని... అది ఎలాగంటే... మనం దేశీయ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, గాంధీ వంటి వారి ధీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చరిత్రలో మనపై దాడులు చేసి, ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయని, కానీ మనం ఎవరికీ హానీ చేయలేదని ఆయన అన్నారు. ఆ సంఘటనల నుంచి మనం పాఠాలు నేర్చుకుని, మనం కూడా ఇతరులను ఇబ్బంది పెట్టకుండా ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. దేశం అభివృద్ధి బాటలో నడవడానికి సరైన నాయకత్వం అవసరమని అన్నారు. ఈ సందర్భంగా నాయకత్వం యొక్క గొప్పతనం గురించి చెబుతూ, ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు భయపడను కానీ సింహం నేతృత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతానని ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ అన్న మాటలను గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. కేవలం పదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపిందని అన్నారు. మరికొన్నేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం వంటి విషయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిబద్ధత, కృషి, నాయకత్వ భావాలు, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.

## ఒక్క క్లిక్ తో వీసా, మాస్టర్‌కార్డ్ చెల్లింపులు

**ఫోన్‌పే నుంచి బోల్ట్ సదుపాయం**

ముంబై: ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే తమ యూజర్ల కోసం ఒక కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్, డెబిట్ కార్డ్ లావాదేవీల కోసం 'ఫోన్‌పే పీజీ బోల్ట్ట పేరుతో కొత్త సదుపాయాన్ని శనివారం ప్రారంభించింది. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు ఒకే క్లిక్‌తో అత్యంత వేగంగా, సురక్షితంగా చెల్లింపులు పూర్తి చేయవచ్చు. ఈ కొత్త విధానం 'డివైస్ టోకెనైజేషన్ట టెక్నాలజీపై పనిచేస్తుంది. యూజర్లు తమ వీసా లేదా మాస్టర్‌కార్డ్ వివరాలను ఫోన్‌పే యాప్‌లో ఒక్కసారి సేవ్ (టోకెనైజ్) చేస్తే సరిపోతుంది. ఆ తర్వాత ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే ఉన్న ఏ మర్చంట్ యాప్‌లోనైనా మళ్లీ మళ్లీ కార్డ్ వివరాలు ఎంటర్ చేయాల్సిన పనిలేదు. అదే డివైస్ లో చేసే తదుపరి లావాదేవీలకు సీవీవీ నంబర్ కూడా అడగదు. దీంతో చెల్లింపుల ప్రక్రియ చాలా సులభతరం అవుతుంది. సాధారణంగా ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో యూజర్‌ను వేరే పేజీకి రీడైరెక్ట్ చేస్తుంటారు. 'బోల్ట్ట ఫీచర్‌తో ఆ అవసరం ఉండదు. మొత్తం లావాదేవీ మర్చంట్ యాప్‌లోనే పూర్తవుతుంది. ఇది యూజర్‌కు సౌకర్యంగా ఉండటమే కాకుండా, లావాదేవీలు మధ్యలో ఆగిపోయే (డ్రాప్-అవుట్స్) సమస్యను తగ్గిస్తుందని కంపెనీ చెబుతోంది. దీనివల్ల వ్యాపారులకు లావాదేవీల సక్సెస్ రేటు కూడా పెరుగుతుంది. ఈ సందర్భంగా ఫోన్‌పే మర్చంట్ బిజినెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ.. "భారతీయులకు డిజిటల్ చెల్లింపులను సులభతరం చేసే మా ప్రయాణంలో 'బోల్ట్ట ఫీచర్ ఒక ముఖ్యమైన ముందడుగు. టోకెనైజేషన్ ద్వారా యూజర్లకు వన్-క్లిక్ అనుభవాన్ని అందిస్తున్నాం. ఇది యూజర్ల సౌకర్యాన్ని పెంచడంతో పాటు, మా మర్చంట్ భాగస్వాముల వ్యాపారాభివృద్ధికి కూడా దోహదపడుతుంది" అని వివరించారు.

# భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపా

**నాకు నోబెల్ రావాలి: డోనాల్డ్ ట్రంప్**



వాషింగ్టన్: భారత్-పాకిస్థాన్ మధ్య 2025లో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను తానే అడ్డుకున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. వైట్‌హౌస్‌లో చమురు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన జోక్యం లేకపోతే ఇరు దేశాల మధ్య అణుయుద్ధం జరిగేదని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రధాని స్వయంగా తన వద్దకు వచ్చి.. ట్రంప్ చొరవ వల్ల కనీసం కోటి మంది ప్రాణాలు దక్కాయని బహిరంగ ప్రకటన చేశారని ఆయన గుర్తుచేశారు. తన హయాంలో ఇప్పటివరకు ఎనిమిది పెద్ద యుద్ధాలను పరిష్కరించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. "చరిత్రలో నాకంటే ఎక్కువగా నోబెల్ శాంతి బహుమతికి అర్హులు ఎవరూ లేరు. 30 ఏళ్లుగా నలుగుతున్న సమస్యలను కూడా నేను పరిష్కరించాను. భారత్-పాక్ మధ్య అప్పటికే ఎనిమిది యుద్ధ విమానాలు కూలిపోయాయి, పరిస్థితి అదుపు తప్పుతున్న వేళ నేను రంగంలోకి దిగి యుద్ధం రాకుండా ఆపాను" అని వివరించారు. శాంతి బహుమతుల కంటే ప్రాణాలు కాపాడటమే తనకు ముఖ్యమని, తాను కోట్ల మందిని కాపాడానని పేర్కొన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను భారత్ మొదటి నుంచీ ఖండిస్తూనే ఉంది. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడంతో భారత్ మే 7న 'ఆపరేషన్ సిందూర్ట చేపట్టింది. పాక్ భూభాగంలోని తొమ్మిది ఉగ్రవాద మౌలిక సదుపాయాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ క్రమంలో భారత సైనిక సత్తాకు భయపడి మే 10న పాక్ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) స్వయంగా భారత అధికారులను సంప్రదించి కాల్పుల విరమణ కోరారని భారత్ చెబుతోంది. ఇందులో మూడో పక్షం జోక్యం ఏమీ లేదని భారత విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేస్తోంది.

# మచాడో నోబెల్ ట్రంప్‌కు ఇవ్వొద్దు

**నోబెల్ కమిటీ స్పష్టీకరణ**



వాషింగ్టన్: వెనెజువెలా విపక్ష నాయకురాలు, 2025 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మారియా కొరినా మచాడో సంచలన ప్రకటన చేశారు. తనకు లభించిన ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇవ్వాలని లేదా ఆయనతో పంచుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, ఈ ప్రతిపాదనను నార్వేజియన్ నోబెల్ కమిటీ తోసిపుచ్చింది. బహుమతిని ఒకసారి ప్రకటించాక బదిలీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. వెనెజువెలాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు చేసిన కృషికి గానూ మచాడో అక్టోబరులో నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. ఇటీవల అమెరికా సైన్యం ఓ ఆపరేషన్‌లో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, నార్కో-టెర్రరిజం కేసుల విచారణ కోసం అమెరికాకు తరలించింది. ఈ నేపథ్యంలో ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడిన మచాడో, ట్రంప్ మద్దతు వల్లే ఇది సాధ్యమైందని ప్రశంసించారు. "ఈ బహుమతి వెనెజువెలా ప్రజలది. దీనిని ట్రంప్‌తో పంచుకోవాలని మేము కోరుకుంటున్నాం" అని ఆమె పేర్కొన్నారు. మచాడో ఆఫర్‌పై ట్రంప్ స్పందిస్తూ, ఇది తనకు 'గొప్ప గౌరవం' అని వ్యాఖ్యానించారు. తాను అధ్యక్షుడిగా 8 యుద్ధాలను ఆపానని, ఒక్కోదానికి ఒక్కో నోబెల్ రావాల్సిందని అన్నారు. త్వరలో మచాడో వాషింగ్టన్‌కు రానున్నారని, అప్పుడు ఈ విషయంపై చర్చిస్తామని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో నార్వేజియన్ నోబెల్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. "ఒకసారి బహుమతి ప్రకటించబడ్డాక ఆ నిర్ణయం శాశ్వతం. దానిని రద్దు చేయడం, బదిలీ చేయడం, లేదా ఇతరులతో పంచుకోవడం సాధ్యపడదు" అని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ఎరిక్ ఆస్‌హెయిమ్ స్పష్టం చేశారు. బహుమతి గ్రహీత నగదును తమకు ఇష్టమైన విధంగా ఉపయోగించుకోవచ్చని, కానీ పురస్కార గౌరవాన్ని మాత్రం బదిలీ చేయలేరని కమిటీ తేల్చి చెప్పింది. మొత్తానికి, ట్రంప్‌పై కృతజ్ఞతతో మచాడో చేసిన ఈ ప్రతిపాదన ఆసక్తికర చర్చకు దారితీసినా, నోబెల్ నిబంధనల ప్రకారం ఇది ఆచరణ సాధ్యం కాదని తేలిపోయింది.

## బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఛైర్మన్‌గా తారిఖ్ రెహ్మాన్

**అనారోగ్య సమస్యలతో ఖలీదా జియా మరణం.. ఏకగ్రీవంగా ఎన్నికైన రెహ్మాన్**

ఢాకా: గత ఏడాది ఆగస్టు 5కు ముందు నాటి రాజకీయ పరిస్థితులు పునరావృతం కాబోవని, దేశం అలాంటి వాతావరణాన్ని కోరుకోవడం లేదని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నూతన ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ పేర్కొన్నారు. బీఎన్‌పీ ఛైర్మన్‌గా తారిఖ్ రెహ్మాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనారోగ్య సమస్యలతో ఆ పార్టీ ఛైర్‌పర్సన్, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా మరణించడంతో ఈ పదవి ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన పార్టీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రెహ్మాన్‌ను పార్టీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫఖ్రుల్ ఇస్లామ్ వెల్లడించారు. ఈ సందర్భంగా తారిఖ్ రెహ్మాన్ మాట్లాడుతూ, 2025 ఆగస్టు 5కు ముందు నాటి పరిస్థితులు ఉండబోవని, షేక్ హసీనా పాలనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాగా, బంగ్లాదేశ్‌లో ప్రధానమంత్రి అభ్యర్థి రేసులో తారిఖ్ రెహ్మాన్ ముందు వరుసలో ఉన్నారు.


## ఒకే వేదికపై హమాస్, లష్కరే

**బయటపడ్డ ఉగ్ర బంధం**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మరోసారి ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారుతోందన్న వాదనలకు బలం చేకూరుస్తూ ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్‌కు చెందిన సీనియర్ కమాండర్ ఒకరు, పాకిస్థాన్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబా నేతలతో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ బహిరంగ సభకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. ఈ వీడియోలలో కనిపించిన వ్యక్తిని హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్‌గా గుర్తించారు. లష్కరే తోయిబాకు రాజకీయ ముసుగుగా భావించే పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఘటనపై ఉగ్రవాద నిరోధక నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హమాస్, లష్కరే తోయిబా నేతలు కలిసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు పెను ముప్పుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం గానీ, సైన్యం గానీ ఇంతవరకు స్పందించలేదు. ఇటీవల కాలంలో హమాస్ పాకిస్థాన్‌లో తన ఉనికిని పెంచుకుంటోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది కూడా నాజీ జహీర్.. జైషే మహ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా వంటి ఉగ్రసంస్థల కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు.

## హిజాబ్ ధరిస్తే ప్రధాని కాలేరు

**ఒవైసీకి సంజయ్ నిరుపమ్ కౌంటర్**



న్యూఢిల్లీ: ఎప్పటికైనా హిజాబ్ ధరించిన మహిళ ఈ దేశానికి ప్రధానమంత్రి అవుతారని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై శివసేన నేత సంజయ్ నిరుపమ్ తీవ్రంగా స్పందించారు. హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని కాగలరని, కానీ అది భారతదేశంలో కాదని, పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్‌లో కావొచ్చని ఆయన అన్నారు. ఒవైసీకి అలాంటి కలలు ఉంటే, నాటి రజాకార్ల మాదిరిగా వెంటనే పాకిస్థాన్‌కు వెళ్లి అక్కడ హిజాబ్ ధరించిన మహిళను ప్రధానిని చేసేందుకు ప్రయత్నించాలని శనివారం ముంబైలో ఘాటుగా వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపైనా సంజయ్ నిరుపమ్ విమర్శలు చేశారు. ఐ-ప్యాక్ కార్యాలయంలో ఈడీ దాడుల సమయంలో మమత అధికారిక విధులకు ఆటంకం కలిగించారని, ఇది రాజ్యాంగ వ్యవస్థను ఉల్లంఘించడమేనని ఆరోపించారు. కేంద్ర ఏజెన్సీల విధులను అడ్డుకోవడం చాలా తీవ్రమైన విషయమని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. మరోవైపు, పవార్ కుటుంబంలో అంతర్గత విభేదాలు పరిష్కారమయ్యాయని అజిత్ పవార్ చెప్పడాన్ని ఆయన ప్రస్తావించారు. పుణె, పింప్రి-చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలు కలిసి పోటీ చేస్తున్నాయని, ఇది విభేదాలు ముగిశాయనడానికి సంకేతమని అన్నారు. ఇది శుభపరిణామమని, భవిష్యత్తులో రాజకీయంగా ఎలాంటి రూపు తీసుకుంటుందో చూడాలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ గురించి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే ఈ కార్యక్రమం భారత ఆత్మగౌరవానికి ప్రతీక అని నిరుపమ్ పేర్కొన్నారు.

## 1849కే ఏడాదంతా కాల్స్

**ఎయిర్ టెల్ నుంచి సరికొత్త ప్లాన్**

ముంబై: ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ తన కస్టమర్లకు ఊరటనిచ్చేలా మరో ఆకర్షణీయమైన ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తరచూ రీఛార్జ్ చేయాల్సిన తలనొప్పికి చెక్ పెట్టేలా, తక్కువ బడ్జెట్‌లోనే దీర్ఘకాలిక ప్లాన్‌లపై ఎయిర్‌టెల్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే ఏడాది పొడవునా చెల్లుబాటు అయ్యే, అపరిమిత కాలింగ్ సౌకర్యంతో కూడిన కొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఎయిర్‌టెల్ తాజాగా తన రీఛార్జ్ ప్లాన్ పోర్ట్‌ఫోలియోను పూర్తిగా అప్‌గ్రేడ్ చేసింది. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ వ్యాలిడిటీ కలిగిన ప్లాన్‌లను అందిస్తూ, తరచూ రీఛార్జ్ చేసుకునే ఇబ్బందిని తగ్గిస్తోంది.



## విజయ్‌కు ప్రచార వాహనం సీజ్

చెన్నై: తమిళ సినీ నటుడు, రాజకీయ నేత విజయ్ చుట్టూ కరూర్ తొక్కిసలాట కేసులో ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 12న ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆయనకు సమన్లు జారీ చేసింది. గతేడాది జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది మృతి చెందిన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో భాగంగా విజయ్ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించిన బస్సును కూడా సీబీఐ అధికారులు తాజాగా స్వాధీనం చేసుకున్నారు. సభ జరిగిన రోజు వాహనం ప్రయాణ వివరాలు, అనుమతులు, సమయపాలన వంటి అంశాలను నిర్ధారించుకునేందుకు వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను కూడా ప్రశ్నించి వివరాలు సేకరిస్తున్నారు.



## వారసత్వాన్ని నాశనం చేస్తున్నారు

**లాలూ కూతురు రోహిణి ఆచార్య**

పాట్నా: తమ వారసత్వాన్ని కొందరు నాశనం చేస్తున్నారని, ఇందుకు బయటి వ్యక్తులు అవసరం లేదని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య విమర్శించారు. ఈ రోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ, కుటుంబ గౌరవాన్ని, ఉనికిని నిలబెట్టిన వారి మూలాలను చెరిపేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు తనను దిగ్భ్రాంతికి గురి చేశాయన్నారు. ఎంతో శ్రమతో సృష్టించిన గొప్ప వారసత్వాన్ని నాశనం చేయడానికి బయటి వ్యక్తులు అవసరం లేదని, తమకు ప్రియమైన వారే ఆ పని చేయగలరని ఆమె వ్యాఖ్యానించారు. తమను నాశనం చేయడానికి సొంత వ్యక్తులే చాలని రోహిణి ఆచార్య అన్నారు. అజ్ఞానం అనే ముసుగు కప్పుకున్నప్పుడు అహంకారం తలకెక్కుతుందని, అప్పుడు వినాశకర శక్తులు ఒక వ్యక్తి ఆలోచనలను, నిర్ణయాలను నియంత్రిస్తాయని ఆమె పేర్కొన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను కుటుంబం నుంచి బహిష్కరించడంపై రోహిణి అసంతృప్తితో ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయం తర్వాత ఆమె తన కుటుంబంతో సంబంధాలు తెంచుకున్నట్లు ప్రకటించారు.

## సరిహద్దు దాటేందుకు చైనా మహిళ యత్నం.. అరెస్ట్

మహారాజ్‌గంజ్ : భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఓ చైనా మహిళను సశస్త్ర సీమా బల్ సిబ్బంది పట్టుకున్నారు. సరైన వీసా, పాస్‌పోర్టు వంటి ప్రయాణ పత్రాలు లేకుండానే ఇండో--నేపాల్ సరిహద్దు దాటేందుకు ఆమె ప్రయత్నించడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లాలో చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో భారత్--నేపాల్ సరిహద్దుకు సమీపంలో ఉన్న నౌటన్వా ప్రాంతంలోని బైరియా బజార్ వద్ద కాలిబాట మార్గంలో ఒక మహిళ భారత్‌లోకి వస్తున్నట్లు ఎస్ఎస్‌బీ సిబ్బంది గమనించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆమెను ఆపి పరిశీలించగా, ఆమె వద్ద ఎలాంటి వీసా లేదా పాస్‌పోర్టు పత్రాలు లేవని తేలింది. దీంతో వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్న సిబ్బంది, స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆమెను విచారించి కేసు నమోదు చేశారు. ఆమె వద్ద లభించిన ఒక చిన్న చీటి ఆధారంగా, సదరు మహిళ చైనాకు చెందిన హుజియా జీగా గుర్తించినట్లు నౌటన్వా పోలీసులు తెలిపారు. అయితే ఆమె చైనాలోని ఏ ప్రాంతానికి చెందినదన్న విషయం ఇంకా స్పష్టతకు రాలేదని, అలాగే భారత్‌లోకి రావడానికి గల అసలు ఉద్దేశం ఏమిటన్న దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను మరింత కఠినతరం చేసినట్లు సమాచారం.



## ఒయ్యారి చిత్రం




# విజయ్ నిర్ణయం సాహసోపేతం!: విశాల్

దళపతి విజయ్ తో సమాంతరంగా కెరీర్ సాగిస్తున్నాడు స్టార్ హీరో విశాల్. కోలీవుడ్ లో అత్యంత కీలకమైన ఫిలింఛాంబర్, నడిగర సంఘం రాజకీయాల్లో అతడు తలమునకలుగా ఉన్నాడు. అలాగే మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్యాంపెయిన్ చేయడంలోను సిద్ధహస్తుడు. రాజకీయాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అతడు ఎంతో కొంత ప్రభావం చూపుతున్నాడనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే ఇప్పుడు విశాల్ తన సహ నటుడు– స్నేహితుడు దళపతి విజయ్ రాజకీయ ఆరంగేట్రంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కోలీవుడ్, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ 2026 అసెంబ్లీ ఎన్నికల దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో విశాల్ ఈ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'సినిమా రంగం వేరు, రాజకీయం వేరు. సినిమాల్లో మనం ఒక స్క్రిప్ట్ ప్రకారం నటిస్తాం. కానీ రాజకీయాల్లో ప్రజల జీవితాలతో నేరుగా సంబంధం ఉంటుంది. ఇది చాలా బాధ్యతతో, సవాల్‌తో కూడున పని. విజయ్ ఈ నిర్ణయం తీసుకోవడం సాహసోపేతమైనది' అని విశాల్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎవరైనా సవాళ్లు ఎదుర్కోవాలని విశాల్ అన్నారు. ఇప్పటికే పాతుకుపోయిన డీఎంకే, ఏఐఏడీఎంకే (ఏఐఏడిఎంకే) వంటి పార్టీలతో తలపడటం అంత సులభం కాదని విశాల్ అభిప్రాయపడ్డారు. అయితే కష్టే ఫలి! అన్న తీరుగా చాలా కష్టపడాలని కూడా విశాల్ సూచించారు. విజయ్‌కు భారీ స్థాయిలో అభిమానులు ఉన్నారు.. కానీ ఆ అభిమానం ఓట్లుగా మారాలంటే క్షేత్రస్థాయిలో ఎంతో కష్టపడాలని పేర్కొన్నారు. తాను కూడా రాజకీయాల్లోకి వస్తానని గతంలోనే ప్రకటించిన విశాల్, సరైన సమయం కోసం వేచి చూస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. నేను ప్రజలకు సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధమే. విజయ్ మార్గాన్ని గమనిస్తున్నానని, భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందని కూడా సంకేతాలిచ్చారు.




# నా కుటుంబంపై తప్పుడు వార్తలు: సురేష్ బాబు



ప్రముఖ నిర్మాత, సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుబాటి సురేష్ బాబు తమ కుటుంబంపై వస్తున్న వార్తలపై స్పందించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను ఖండించారు. డెక్కన్ కిచెన్ కేసులో తన ఫ్యామిలీకి నాన్ బెయిలబుల్ వారెంట్ ఆదేశాలు ఇచ్చారని, ఈ నెల 23న కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోర్టు ఆదేశించిందని వస్తున్నవి అవాస్తవమని తెలిపారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు సురేష్ బాబు. సురేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం, 2025 నవంబర్ 14వ తేదీన హైదరాబాద్‌లోని అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వుల్లో తమ వ్యక్తిగత హాజరుపై ఎలాంటి అత్యవసరం లేదని, అలాగే తమపై లేదా ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టంగా నమోదు చేసిందన్నారు. ఆ రోజు ఈ వ్యవహారాన్ని కేవలం క్రిమినల్ మిస్లేనియస్ పిటిషన్ల పరిష్కారం కోసం మాత్రమే 2026 జనవరి 9కు వాయిదా వేసినట్లు తెలిపారు. అలాగే 2026 జనవరి 9వ తేదీన కూడా కోర్టు ఈ కేసును కేవలం క్రిమినల్ మిస్లేనియస్ పిటిషన్ల పరిష్కారానికే విచారణకు తీసుకుందని, వ్యక్తిగత హాజరు అవసరం లేదని మరోసారి స్పష్టమైందని సురేష్ బాబు పేర్కొన్నారు. అయినప్పటికీ స్పష్టమైన న్యాయపరమైన వాస్తవాలను పక్కనపెట్టి, ఇటీవల ఓ ఇంగ్లిష్ దినపత్రిక సంచలనాత్మకంగా, తప్పుదారి పట్టించేలా వార్త ప్రచురించిందని ఆరోపించారు. ఆ విధమైన తప్పుడు కథనాలు ప్రజల్లో గందరగోళం సృష్టించడమే కాకుండా, వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. తాను ఎప్పుడూ న్యాయ ప్రక్రియకు పూర్తిస్థాయిలో ఎప్పుడూ సహకరిస్తూనే ఉన్నానని తెలిపారు.

# రాజాసాబ్‌లో 8 నిమిషాల అదనపు సీన్లు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన భారీ చిత్రం 'ది రాజా సాబ్ల బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. తొలి రోజు ఈ సినిమాకు మిక్సడ్ టాక్ వచ్చినప్పటికీ, వసూళ్ల విషయంలో మాత్రం ప్రభాస్ స్టామినా స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా నైట్ షోల నుంచి పుంజుకున్న ఈ చిత్రం, శనివారం నాటి అడ్వాన్స్ బుకింగ్స్‌లోనూ అదరగొట్టింది. ఫాంటసీ, హారర్ కామెడీ మరియు సైకలాజికల్ థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ మూవీకి ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. కేవలం అభిమానుల అంచనాల వల్లే కొంత నెగిటివిటీ వినిపించినా, సాధారణ ప్రేక్షకులు మాత్రం మారుతి మార్క్ వినోదాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నారని ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా, శనివారం థియేటర్లలో ప్రభాస్ 'ఓల్డ్ గెటప్లకు సంబంధించిన 8 నిమిషాల నిడివి గల అదనపు సన్నివేశాలను జోడించినట్లు దర్శకుడు మారుతి ప్రకటించారు. టీజర్లలో చూసిన ఓల్డ్ లుక్ సినిమాలో లేకపోవడంతో కొంత అసంతృప్తిగా ఉన్న అభిమానుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.







## సమ్మర్‌కు 'ఆదర్శ కుటుంబం'!

టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న కాంబోలలో విక్టరీ వెంకటేష్-- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ జోడీ ఒకటి. వీరిద్దరి కాంబోలో వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్ణ, 'మల్లీశ్వరి' వంటి సినిమాలు కేకపుట్టించాయి. తాజాగా వీరిద్దరి కలయికలో 'ఆదర్శ కుటుంబం ఏకే 47' ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను దర్శకుడు త్రివిక్రమ్ అత్యంత వేగంగా పూర్తి చేయాలని గట్టి ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా త్రివిక్రమ్ సినిమాలు షూటింగ్ పూర్తవ్వడానికి ఎక్కువ సమయం పడుతాయనే అభిప్రాయం ఉన్నా, ఈ సినిమాతో ఆ ఇమేజ్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఆయన ముందుకెళ్తున్నారట. మే నెల కల్లా షూటింగ్ మొత్తం పూర్తి చేసి, సమ్మర్‌లోనే సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో షెడ్యూళ్లను కట్టుదిట్టంగా ప్లాన్ చేస్తున్నారని టాక్.

## అనగనగా ఒక రాజు టికెట్ రేట్ల పెంపు

టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'అనగనగా ఒక రాజు'ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు మారి ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా మలిచాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్



ఈ మూవీపై సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. అయితే, సంక్రాంతి బరిలో రిలీజ్‌కు రెడీ అయిన ఈ సినిమాకు ఏపీ ప్రభుత్వం అదిరిపోయే బూస్ట్ ఇచ్చింది. ఏపీలో ఈ సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సినిమా రిలీజ్ రోజు.. అంటే జనవరి 14 నుంచి 10 రోజుల పాటు ఈ చిత్రానికి టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.75 చొప్పున టికెట్ రేట్లు పెంచుకునేందుకు ఏపీ సర్కార్ పర్మిషన్ ఇచ్చింది. ఇక ఈ బూస్ట్‌తో ఈ మూవీకి మంచి రెస్పాన్స్ దక్కుతుందని మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నవీన్ పొలిశెట్టి మార్క్ కామెడీ టైమింగ్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర అదిరిపోయే రెస్పాన్స్ తెచ్చుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## సుకుమారీ.. డిఫరెంట్‌గా ఐశ్వర్య

ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో తో యంగ్ హీరో తిరువీర్ బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్ ను అందుకున్నారు. అలాగే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ కూడా ఓ భారీ బ్లాక్ బస్టర్ ను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఓ పాన్ ఇండియా సినిమా చేస్తున్నారు. అదే ఓ.. సుకుమారీ. ఐశ్వర్యా రాజేష్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ సినిమాలో ఆమె లుక్ ను రివీల్ చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. తిరువీర్, ఐశ్వర్యా జంటగా నటిస్తున్న ఈ సినిమాతో భరత్ దర్శన్ డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో మహేశ్వర రెడ్డి మూలి ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇక రీసెంట్ గా రిలీజ్ చేసిన పోస్టర్ చూస్తుంటే సినిమాలో ఐశ్వర్య పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించనున్నట్టు అర్థమవుతుంది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో ఫుల్ లెంగ్త్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా తెరకెక్కనున్నట్టు తెలుస్తోంది. అయితే పోస్టర్ లో ఐశ్వర్యా విలేజ్ లుక్స్ మాత్రమే కాకుండా ఆమె వెనుక ఊరి లోని జనమంతా పరిగెత్తడం కూడా చూపించారు. చూస్తుంటే సినిమాలో ఐశ్వర్య పాత్ర చాలా కొత్తగా ఉండనున్నట్టు తెలుస్తోంది. దామిని అనే సాంప్రదాయ యువతిగా ఐశ్వర్య లుక్ ను మేకర్స్ ప్రెజెంట్ చేయగా, ఈ లుక్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. పోస్టర్ ను బట్టి చూస్తుంటే సినిమా ఇంట్రెస్టింగ్ స్టోరీ లైన్‌తోనే తెరకెక్కుతున్నట్టు అనిపిస్తోంది. పోస్టర్ లో ఐశ్వర్య ఎక్స్‌ప్రెషన్స్ కూడా చాలా డిఫరెంట్ గా కొత్తగా ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు కుషేందర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాతో తెలుగుతో పాటూ తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు






# నిఖత్ జరీన్‌కు గోల్డ్ మెడల్

గ్రేటర్ నోయిడాలో జరిగిన నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుసాముద్దీన్ గోల్డ్ మెడల్స్ సాధించారు. 51 కేజీల విభాగంలో నిఖత్ జరీన్.. 2023 ప్రపంచ ఛాంపియన్ నితూ ఘూంగాస్‌ను ఓడించి తన మూడో నేషనల్ టైటిల్‌ను గెలుచుకున్నారు. మరోవైపు హుసాముద్దీన్ 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్‌పై విజయం సాధించారు. 75 కిలోల విభాగంలో లవ్లీనా బోర్గోహైన్ సైతం గోల్డ్ మెడల్ సాధించారు.



# ముంబై బోణీ

## ఢిల్లీపై ఘన విజయం

మహిళల ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టింది. నవీముంబయి వేదికగా.. దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 196 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన దిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌటైంది. చినెల్లె హెన్రీ (56) మినహా మిగతావారెవ్వరూ పెద్దగా రాణించలేదు. ముంబయి బౌలర్లలో నికోలా కారీ, అమేలియా కేర్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. బ్రంట్ 2 వికెట్లు, ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా తలో వికెట్ తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. బ్రంట్ (70), హర్మన్‌ప్రీత్ కౌర్ (74) అర్ధశతకాలతో చెలరేగారు. నికోలా కారీ (21), కమలిని (16) ఫర్వాలేదనిపించారు. దిల్లీ బౌలర్లలో నందిని శర్మ 2 వికెట్లు పడగొట్టగా.. హెన్రీ, శ్రీచరణి ఒక్కో వికెట్ తీశారు.

## మార్స్ మీదకు పంపినా ఆడాల్సిందే: మహేదీ హసన్



బంగ్లాదేశ్ టీ20 వరల్డ్ కప్ 2026 ఆడుతుందా.. లేదా.. అనే విషయంలో ఇప్పటివరకు ఓ క్లారిటీ రాలేదు. ముస్తాఫిజుర్ రెహమాన్ వివాదం నేపథ్యంలో.. భద్రత కారణాల దృష్ట్యా తమ ఆటగాళ్లను భారత్‌కు పంపబోమని, తమ మ్యాచ్‌లని మరో వేదికకు మార్చాలని ఐసీసీకి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ లేఖ రాసింది. అయితే ఈ విన్నపాన్ని ఐసీసీ సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. ఒక వేళ బంగ్లా మ్యాచ్‌లను తరలించడం వీలు కాకపోతే.. ఆ జట్టు టీ20 వరల్డ్‌కప్ ఆడుతుందా.. లేదా.. అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ తరుణంలో బంగ్లా క్రికెట్ జట్టు సభ్యుడు, ఆల్‌రౌండర్ మహేదీ హసన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. 'అనిశ్చితి విషయం టీమ్ మేనేజ్‌మెంట్ చూసుకుంటుంది. అధికారులు ఆ అంశం మీద నిర్ణయం తీసుకుంటారు. కేవలం మ్యాచ్‌లు ఆడటం మాత్రమే క్రికెటర్ల పని. ఒకవేళ ఆటగాళ్లను మార్స్ మీదకు పంపితే.. అక్కడ కూడా వారు ఆడాల్సిందే. ఈ విషయంలో ఇతర ఆటగాళ్లకు సందేహాలుంటాయని నేనైతే అనుకోవడం లేదు' అని హసన్ అన్నాడు.




# నా విధిని ఎవరూ మార్చలేరు: గిల్

ఫామ్‌లో లేని బ్యాటర్ శుభమన్ గిల్‌ను టీ20 వరల్డ్‌కప్‌కు ఎంపిక చేయని విషయం తెలిసిందే. అయితే ఆ విషయంలో తన విధిని ఎవరూ మార్చలేరన్నారు. నా నుదుటి మీద ఏది రాసి ఉన్నా, దాన్ని నా నుంచి ఎవరూ తీసుకెళ్లలేరన్నారు. ఆదివారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడనున్న గిల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఎక్కడ ఉండాలో అక్కడ ఉన్నానని, నా విధిని నానుంచి ఎవ్వరూ తీసుకెళ్లలేరని అన్నారు. ఇండియా తరపున ఇప్పటి వరకు గిలర్ 36 వన్డేలు ఆడారు. దాంట్లో అతను 869 రన్స్ చేశాడు. 28.03 సగటు, 138.59 స్ట్రయిక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడతను. దేశం కోసం ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని ప్లేయర్లు నమ్ముతారని, సెలెక్టర్లు వాళ్ల నిర్ణయం వాళ్లు తీసుకుంటారని, తానెప్పుడూ ఆ సందర్భాన్ని గడిపేస్తానని, జీవితం సింపుల్‌గా మారుతుందన్నారు. అయితే ఏ ఫార్మాట్ కూడా అనుకున్నట్లు ఈజీ కాదు అన్నారు. 2011 నుంచి ఇండియా వన్డే వరల్డ్‌కప్ నెగ్గలేదన్నారు. టీ20 జట్టు ఎంపిక విషయంలో సెలెక్టర్ల నిర్ణయాన్ని గౌరవిస్తానన్నారు.



# చేతులెత్తేసిన సింధూ!



మలేషియా ఓపెన 2026 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి, మాజీ ప్రపంచ ఛాంపియన్ పీవీ సింధు పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో చైనా క్రీడాకారిణి చేతిలో ఓటమి పాలవ్వడంతో ఈ టోర్నీలో భారత సవాల్ కూడా ముగిసినట్లు అయింది. క్వార్టర్ ఫైనల్లో ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వడంతో నేరుగా సెమీస్‌కు చేరిన పీవీ సింధుకు.. సెమీ ఫైనల్లో ప్రపంచ రెండో నంబర్ క్రీడాకారిణి వాంగ్ జీ యీ నుంచి గట్టి పోటీ ఎదురైంది. హెూరాహెూరీగా సాగిన ఈ పోరులో చైనా క్రీడాకారిణి 21-16, 21-15 తేడాతో సింధుపై విజయం సాధించింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 18వ స్థానంలో ఉన్న సింధు.. టాప్ ర్యాంకర్ వాంగ్‌కు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ విజయాన్ని అందుకోలేకపోయింది. తొలి గేమ్‌లో ఇద్దరు క్రీడాకారిణులు పాయింట్ల కోసం తీవ్రంగా శ్రమించారు. ఒక దశలో స్కోరు 14-14తో సమంగా ఉంది. అయితే కీలక సమయంలో సింధు కొన్ని అనవసర తప్పిదాలు చేయడంతో వాంగ్ ఆధిక్యంలోకి వెళ్లి 21-16తో గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు అద్భుత పునరాగమనం చేసింది. ముందుగా వెనుకబడినప్పటికీ పట్టుదలతో ఆడి స్కోరును 13-13 వద్ద సమం చేసింది. కానీ చివరి నిమిషాల్లో వాంగ్ తన దూకుడును ప్రదర్శించి వరుస పాయింట్లు సాధించడంతో సింధుకు ఓటమి తప్పలేదు. పీవీ సింధు నిష్క్రమణతో మలేషియా ఓపెన్‌లో భారత్ ఆశలు గల్లంతయ్యాయి. ఈ విజయంతో వాంగ్ జీ యీ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

## అందుకే ఓడిపోయాం: యూపీ కెప్టెన్

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026లో గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఓటమి పాలైనప్పటికీ.. యూపీ వారియర్స్ కెప్టెన్ మెగ్ లానింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం ఆమె తన జట్టు ప్రదర్శన, నేర్చుకున్న పాఠాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన హై-స్కోరింగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్ 10 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ ఓటమిపై స్పందిస్తూ కెప్టెన్ మెగ్ లానింగ్ సానుకూల దృక్పథంతో మాట్లాడారు. 'ఇది చాలా మంచి గేమ్. మేము గెలుపుతో ఈ సీజన్‌ను ప్రారంభించాలని అనుకున్నాం, కానీ దురదృష్టవశాత్తు ఫలితం మాకు అనుకూలంగా రాలేదు. గుజరాత్ జెయింట్స్ బ్యాటర్లు అత్యద్భుతంగా ఆడారు. వారు మా బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. పిచ్ బ్యాటింగ్‌కు చాలా అనుకూలంగా ఉంది, అందుకే బౌలర్లకు ఇది సవాల్‌గా మారింది' అని లానింగ్ పేర్కొన్నారు.




# నెట్స్‌లో రో-కో ఊచకోత

న్యూజిలాండ్‌తో ఆదివారం ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. వడోదరలోని బీసీఏ స్టేడియంలో జరగనున్న తొలి వన్డేకు ముందు ఈ స్టార్ జోడీ నెట్స్‌లో చెమటోడుస్తున్న వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది. 'రోకో రీలోడెడ్' పేరుతో విడుదలైన ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతూ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీ తన ట్రేడ్‌మార్క్ స్టైలిష్ ఆఫ్-డ్రైవ్స్, కవర్ డ్రైవ్స్‌తో అద్భుతమైన ఫామ్‌లో కనిపించారు. ఇటీవలే దక్షిణాఫ్రికా సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అందుకున్న కోహ్లీ.. అదే జోరును కివీస్‌పై కూడా కొనసాగించేలా కనిపిస్తున్నారు. మరోవైపు వన్డేల్లో నంబర్ 1 బ్యాటర్ అయిన రోహిత్ శర్మ తనదైన శైలిలో లెగ్-గ్లాన్స్, పుల్ షాట్లను ప్రాక్టీస్ చేస్తూ కివీస్ బౌలర్లకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. బ్యాటింగ్‌తో పాటు ఇద్దరూ ఫీల్డింగ్ డ్రిల్స్, క్యాచింగ్ ప్రాక్టీస్‌లోనూ అత్యంత చురుగ్గా పాల్గొంటూ తమ ఫిట్‌నెస్‌ను చాటుకున్నారు. ఈ అంతర్జాతీయ సిరీస్‌కు ముందు రోహిత్, విరాట్ ఇద్దరూ దేశవాళీ వన్డే టోర్నీ అయిన విజయ్ హజారే ట్రోఫీలో అదరగొట్టడం విశేషం. దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ టోర్నీలో ఆడిన విరాట్ కోహ్లీ, ఢిల్లీ తరఫున ఆంధ్రప్రదేశ్‌పై 131 పరుగులు, గుజరాత్‌పై 77 పరుగులు చేసి పాత రోజులను గుర్తు చేశారు. ఇక రోహిత్ శర్మ సైతం ముంబై తరఫున సిక్కింపై కేవలం 94 బంతుల్లోనే 155 పరుగులు సాధించి తన ఫామ్‌పై ఉన్న సందేహాలను పటాపంచలు చేశారు. ఈ ప్రదర్శనలు చూస్తుంటే కివీస్ బౌలర్లకు వడోదరలో చుక్కలు తప్పవనిపిస్తోంది.

# అనుష్క ఆట సూపర్: గుజరాత్ కెప్టెన్


డబ్ల్యూపీఎల్ 2026లో భాగంగా యూపీ వారియర్స్‌తో జరిగిన హై-స్కోరింగ్ మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలిచిన తర్వాత గుజరాత్ జెయింట్స్ కెప్టెన్ ఆష్లే గార్డనర్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ విజయం జట్టులో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆమె పేర్కొన్నారు. మ్యాచ్ అనంతరం గుజరాత్ జెయింట్స్ కెప్టెన్ ఆష్లే గార్డనర్ మాట్లాడుతూ.. 'ఈ మైదానంలో పరుగులు ఎంత వేగంగా వస్తాయో ఈ మ్యాచ్ నిరూపించింది. 11 ఓవర్లు ముగిసే సమయానికే, మేము కనీసం 200 పరుగులు సాధించాలని నిర్ణయించుకున్నాం. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ బ్యాటింగ్ చేస్తున్న తీరు చూస్తుంటే అది తప్పనిసరి అనిపించింది. మేము బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ మంచి ప్రదర్శన చేశాం, కానీ మా ఫీల్డింగ్ అద్భుతంగా సాగింది. అదే చివరికి మ్యాచ్ ఫలితంలో తేడా చూపింది' అని గార్డనర్ విశ్లేషించారు. అరంగేట్ర మ్యాచ్‌లోనే మెరిసిన యువ ప్లేయర్ అనుష్క శర్మ గురించి గార్డనర్ ప్రత్యేకంగా మాట్లాడారు. 'అనుష్క చాలా ప్రత్యేకమైన క్రీడాకారిణి. ఇప్పటి వరకు ఆమెను కేవలం నెట్స్‌లో మాత్రమే చూశాను.

## బుడ్డోడి విధ్వంసం

### సిక్సర్ల వర్షంతో స్టేడియం ముద్ద

టీమిండియా యువ సంచలనం కేవలం 14 ఏళ్ల వయస్సులోనే క్రికెట్ ప్రపంచాన్ని తన వైపు తిప్పుకున్న వైభవ్ సూర్యవంశీ మరోసారి బ్యాట్‌తో గర్జించాడు. దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న అండర్-19 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందు జరిగిన వార్మప్ మ్యాచ్‌లో వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. శనివారం స్కాట్లాండ్‌తో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ స్కాట్లాండ్ బౌలర్లను ఊచకోత కోశాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియాకు వైభవ్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 50 బంతుల్లోనే 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. 192.00 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన వైభవ్ ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. వైభవ్ గత కొన్ని రోజులుగా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. 74 బంతుల్లోనే 127 పరుగులు (10 సిక్సర్లు, 9 ఫోర్లు) బాదాడు. ఇప్పుడు మళ్లీ 96 పరుగుల ఇన్నింగ్స్‌తో తానెంతటి ప్రమాదకరమైన ఆటగాడో నిరూపించుకున్నాడు. ఈ 14 ఏళ్ల కుర్రాడి దూకుడు చూస్తుంటే వరల్డ్ కప్‌లో భారత్‌కు తిరుగుండదనిపిస్తోంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 11-1-2026



## భారత భాగ్యవిధాత శాస్త్రి

భారతదేశ రాజకీయ చరిత్రలో ఎందరో నాయకులు వచ్చారు, వెళ్లారు. కానీ, కొందరు మాత్రమే కాలం చెరపలేని ముద్ర వేస్తారు. స్వార్థం రాజ్యమేలుతున్న ప్రస్తుత రాజకీయ కాలంలో, నిస్వార్థానికి, నిరాడంబరతకు, నైతికతకు నిలువుటద్దంలా నిలిచిన మహోన్నత వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రి. ఆయన కేవలం ఐదు అడుగుల మనిషి మాత్రమే కాదు, హిమాలయమంతటి ఆత్మవిశ్వాసం గల ధీశాలి. శాస్త్రి గారి జీవితం 'సాదా సీదా జీవనం - ఉన్నతమైన ఆలోచన' అనే సూత్రానికి నిదర్శనం. ఉత్తరప్రదేశ్‌లోని ఒక పేద కుటుంబంలో జన్మించిన ఆయన, పాఠశాలకు వెళ్లడానికి పడవ వాడికి ఇచ్చే డబ్బులు లేక తన పుస్తకాలను తలపై పెట్టుకుని గంగానదిని ఈదుకుంటూ వెళ్లేవారు. ఆ పట్టుదలే ఆయనను దేశ అత్యున్నత పదవికి చేర్చింది. ఆయన 'శాస్త్రి' అనేది కులం పేరు కాదు, కాశీ విద్యాపీఠం నుండి పొందిన పట్టా. ఇది ఆయన విద్యా విలువల పట్ల ఉన్న గౌరవానికి చిహ్నం. నేటి కాలంలో పదవుల కోసం పాకులాడే నాయకులను చూస్తున్నాం. కానీ శాస్త్రి గారు రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన ఒక రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి ప్రధాని నెహ్రూ గారు వద్దంటున్నా వినకుండా, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు విఫలమైతే పక్కకు తప్పుకోవాలి అని ఆయన చాటిన విలువలు ప్రజాస్వామ్యానికే పాఠాలు. 1964లో నెహ్రూ మరణానంతరం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు శాస్త్రి గారు బాధ్యతలు చేపట్టారు. ఒకవైపు ఆహార కొరత, మరోవైపు పాకిస్థాన్ దురాక్రమణ. ఈ రెండు సవాళ్లను ఆయన ఎదుర్కొన్న తీరు అద్భుతం. దేశంలో అన్నం తక్కువగా ఉన్నప్పుడు, ప్రజలకు పిలుపునిచ్చే ముందు తన ఇంట్లో ఒక పూట ఉపవాసం ఉండి, అది సాధ్యమని నమ్మాక దేశ ప్రజలను కోరారు. అది ఆయన చిత్తశుద్ధి. నేడు భారత్ పాల ఉత్పత్తిలో, ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించిందంటే దానికి పునాది వేసింది శాస్త్రి గారే. అమూల్ డెయిరీ అభివృద్ధికి ఆయన ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. శాస్త్రి గారు శాంతిని ప్రేమించేవారే, కానీ దేశ రక్షణ విషయంలో రాజీ పడలేదు. 1965లో పాకిస్థాన్ దాడి చేసినప్పుడు, భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చి లాహోర్ సరిహద్దుల వరకు మన జెండాను ఎగురవేయించారు. బలాన్ని ప్రదర్శించకపోతే బలహీనంగా భావిస్తారు అని నిరూపించిన ధీశాలి ఆయన. ప్రధాని అయిన తర్వాత కూడా ఆయన సొంత కారు కొనుక్కోవడానికి బ్యాంకు నుండి రుణం తీసుకున్నారు. ఆయన మరణించే నాటికి ఆ అప్పు తీరలేదు. ప్రధాని హోదాలో ఉండి కూడా తన బట్టలను తానే ఉతుక్కునేవారని చెబితే ఆశ్చర్యం కలగక మానదు. ఆయన సంపాదించుకున్న ఏకైక ఆస్తి ప్రజల ప్రేమాభిమానాలు మాత్రమే. తాష్కెంట్ ఒప్పందం తర్వాత ఆయన అనుమానాస్పద స్థితిలో మరణించడం దేశానికి తీరని లోటు. అయితే ఆయన భౌతికంగా లేకపోయినా, ఆయన వదిలివెళ్లిన ఆశయాలు, నైతిక విలువలు ఎప్పటికీ సజీవం. నేటి తరానికి శాస్త్రి గారి జీవితం ఒక గొప్ప పాఠం. పదవి కంటే బాధ్యత గొప్పదని, ఆర్భాటం కంటే నిజాయితీ గొప్పదని నిరూపించిన ఆ చిన్న మనిషి చేసిన పెద్ద పనులు భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటాయి. నిజాయతీ గల నాయకత్వం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే మనం లాల్ బహదూర్ శాస్త్రిని చూడాలి. ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి ఆయన చూపిన బాటలో నడవడమే.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం





# నింగికి నిచ్చెన.. ఇస్రో

ఒకప్పుడు సైకిళ్లపై రాకెట్ భాగాలను, ఎడ్లబండ్లపై శాటిలైట్లను మోసుకెళ్లిన దేశం.. నేడు ప్రపంచ దేశాల ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపే స్థాయికి చేరింది. ఇది ఏ ఒక్క రోజులోనో జరిగిన అద్భుతం కాదు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తల దశాబ్దాల కఠోర శ్రమ, అంకితభావం మరియు అపారమైన మేధస్సుకు నిదర్శనం. నేడు ఇస్రో కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు, 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతిరూపం. 1960వ దశకంలో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ కన్న కల ఇస్రో.




అభివృద్ధి చెందుతున్న దేశానికి అంతరిక్ష పరిశోధనలు అవసరమా? అని ప్రపంచం ప్రశ్నించినప్పుడు, మేము ఎవరితోనూ పోటీ పడటం లేదు, కానీ సాంకేతికతను సామాన్యుడి జీవితం మెరుగుపడటానికి ఉపయోగిస్తాం అని ఆయన సమాధానమిచ్చారు. ఆ ఆశయమే నేడు ఇస్రోను ప్రపంచంలోని టాప్-5 అంతరిక్ష సంస్థలలో ఒకటిగా నిలబెట్టింది. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇస్రో వైపు చూస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం విశ్వసనీయత, తక్కువ ఖర్చు. ఒకే ప్రయోగంలో 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి, ప్రపంచ రికార్డు సృష్టించిన ఘనత ఇస్రోకే దక్కుతుంది. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ద్వారా అంతరిక్ష వాణిజ్యంలో భారత్ బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

ఇస్రో విజయాలు కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదు, అది భారతీయ యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే ఒక స్ఫూర్తి. పరిమిత వనరులతో అపరిమితమైన విజయాలను ఎలా సాధించవచ్చో ఇస్రో ప్రపంచానికి చాటిచెప్పింది. ప్రధాని మోదీ అన్నట్లుగా, ఇస్రోకు ఆకాశమే హద్దు కాదు.. అది కేవలం ఒక ప్రారంభం మాత్రమే. రాబోయే రోజుల్లో ప్రైవేట్ భాగస్వామ్యం కూడా తోడైతే, అంతరిక్ష రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా మారుతుందనడంలో సందేహం లేదు. జాబిల్లిపై భారత్ సంతకం ఇస్రో చరిత్రలో చంద్రయాన్-3 ఒక అద్భుత ఘట్టం. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన ప్రపంచపు మొట్ట మొదటి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. గతంలో చంద్రయాన్-2 వైఫల్యం నుండి నేర్చుకున్న పాఠాలతో, అతి తక్కువ ఖర్చుతో (హాలీవుడ్ సినిమాల బడ్జెట్ కంటే తక్కువతో) ఈ విజయాన్ని సాధించడం ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచింది. ఇది భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి పరాకాష్ట. తొలి ప్రయత్నంలోనే అంగారకుడిపైకి మొదటి ప్రయత్నంలోనే అంగారక కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపిన ఏకైక దేశం భారత్. అమెరికా, రష్యా వంటి దేశాలు సైతం అనేక ప్రయత్నాల తర్వాత సాధించిన ఈ ఘనతను, ఇస్రో చాలా తక్కువ బడ్జెట్‌తో సాధించి "ఫ్రూగల్ ఇంజనీరింగు (మితవ్యయ సాంకేతికత) కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. సూర్యుడిపై నిఘా చంద్రుడిని జయించిన తర్వాత, ఇస్రో తన దృష్టిని సూర్యుడిపైకి మళ్లించింది. ఎల్-1 పాయింట్ వద్ద ఆదిత్య ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి, సౌర తుఫానులు, వాతావరణ మార్పులను అధ్యయనం చేయడంలో భారత్ ముందడుగు వేసింది. ఇలా వరుస విజయాలతో ఇస్రో దూసుకెళ్తోంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.